# ప్రజాస్వామ్యాన్నీ ప్రజాస్వామ్య హక్కులనూ కాపాడుకోవడానికి ఐక్యమవుదాం

## విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) తన 10వ రాష్ట్ర మహాసభలు ఈ సంవత్సరం సెప్టెంబర్ 12,13 తేదీలలో హైదరాబాద్‌లో జరుపుకుంటూ ఉంది.

వలస పాలనకు వ్యతిరేకంగా మనం పోరాడినపుడు మన ముందు ఒక లక్ష్యం పెట్టుకొన్నాం. భారతదేశాన్ని సామ్రాజ్యవాద పాలన నుండి విముక్తి చేయడమేకాక ఒక ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థనూ ప్రజాస్వామిక స్వభావం గల సమాజాన్నీ నిర్మించుకోవాలన్నది ఆ లక్ష్యం. ఆ లక్ష్యాన్ని, పాక్షికంగానే అయినప్పటికీ, రాజ్యాంగంలో కూడ రాసుకోవడం జరిగింది. ఆ తరువాతి చరిత్ర మాత్రం ఈ లక్ష్యాన్ని, కనీసం పీడిత ప్రజలకు సంబంధించింత వరకు, చాలా సందర్భాలలో వమ్ము చేసిందనే చెప్పుకోవాలి. సంపూర్ణమైన రాజకీయ సామాజిక ప్రజాస్వామ్యం భారతదేశంలో ఈనాటికీ వెలుగు చూడలేదు. వర్గ, కుల, లింగ అసమానతలకు గురయ్యే ప్రజలకు, ఆదివాసీలకూ, మైనారిటీలకూ, వివక్షకు గురయ్యే జాతులకూ, ధనిక వర్గాల ప్రయోజనాల కోసం సాగే అభివృద్ధి పథంలో బలి అయ్యే ప్రజలకు, భారత ప్రజాస్వామ్యం ఇచ్చేది కొంచెమే.

స్వాతంత్ర్య పోరాటం నాటి ప్రజాస్వామ్య లక్ష్యాన్ని సాధించుకునే కర్తవ్యం ఇంకా సజీవంగానే ఉంది. అది పీడిత ప్రజల పోరాటాలలో సజీవంగా ఉంది. ప్రజాస్వామ్య రాజకీయ సంస్కరణల కోసం ముందుకొస్తున్న డిమాండ్‌లలో సజీవంగా ఉంది. సామాజిక న్యాయకాంక్షలో సజీవంగా ఉంది. ప్రపంచ బ్యాంకు ప్రోద్బలంతో సాగుతున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణ పట్ల విస్తృతంగా వ్యక్తం అవుతున్న నిరసనలో సజీవంగా ఉంది. రాజకీయ నాయకుల చేతిలోనూ అధికారగణం చేతిలోను జరుగుతున్న ప్రజాతంత్ర లౌకిక వాద విలువల విధ్వంసం పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకతలో సజీవంగా ఉంది. అది ఎన్నికల రాజకీయాలలోనూ సజీవంగా ఉంది, అసంఘటితంగా జరిగే పోరాటాలలోనూ సంఘటిత ప్రజా పోరాటాలలోనూ సజీవంగా ఉంది. ప్రస్తుత రాజకీయ వ్యవస్థను తిరస్కరించే రాజకీయ పోరాటాలలోనూ సజీవంగా ఉంది.

స్వాతంత్ర్య పోరాట కాలం నాటి ప్రజాస్వామ్య లక్ష్యాలను సాధించుకునే ఈ కృషిలో భాగంగా పౌర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఎపిసియల్‌సి వంటి సంస్థలు గణనీయమైన కృషి చేసాయి. ఆ లక్ష్యం అందకుండా పోయిన వైనాన్ని ఎండగట్టాయి, ఆ దిశగా ముందుకొచ్చిన ఆర్థిక సాంఘిక ప్రజాస్వామ్యం కోసం, న్యాయం కోసం, ప్రజలకు గల పోరాడే హక్కుకు మద్దతు నిచ్చాయి.

చిత్రహింసలు, లాకప్పు హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్ల రూపంలో జరుగుతున్న చట్టబాహ్యమైన హత్యాకాండలకు వ్యతిరేకంగా ఎ.పి.సి. ఎల్.సి ఆందోళన చేసింది. నేరాలను న్యాయస్థానాలలో నిష్పాక్షికంగా విచారించాలే తప్ప పోలీస్ లాకప్పులోనే శిక్షలు వేయడానికి వీలులేదని చట్ట బద్ధ పాలనకు సంబంధించిన ప్రాథమిక సూత్రాన్ని నిలబెట్టడానికి కృషి చేసింది. రాజ్యాంగ ప్రాథమిక హక్కులనూ సహజ న్యా యసూత్రాలనూ అతిక్రమించే అప్రజాస్వామిక చట్టాలను వ్యతిరేకించింది.

సామాజిక సంబంధాలలోనూ సామాజిక. వ్యవస్థలోనూ ప్రజాస్వామ్యం కోసం ఎ.పి.సి.ఎల్.సి ఆందోళన చేసింది. కులరహిత సమాజం కావాలనీ, మనిషి స్థితిగతులను పుట్టుకను బట్టి పరిమితం చేసే సామాజిక వ్యవస్థ పోవాలనీ కోరుకుంటున్న దళిత ఉద్యమ ఆకాంక్షలకు అండగా నిలబడింది. అంటరానితనానికి వ్యతిరేకంగానూ దళితులపైన జరిగే అత్యాచారాలకు వ్యతిరేకంగానూ ఆందోళన చేసింది. సమాన హక్కులూ సమాన సామాజిక ప్రతిపత్తీ కావాలన్న స్త్రీల ఆకాంక్షలకు అండగా నిలబడింది. కుటుంబంలోపలా బయటా స్త్రీలపైన జరిగే హింసను వ్యతిరేకించింది. వేతనాలు, స్త్రీ కార్మికు హక్కులు, లైంగిక అత్యాచారాలు, కుటుంబ హింసలకు సంబంధించిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ఎపిసిఎల్‌సి పోలీసులపైన, పాలనా యంత్రాంగం పైన ఒత్తిడి పెట్టింది. వివక్ష, అణచివేతల భయం లేని గౌరవప్రదమైన మనుగడ కోసం మైనారిటీలలో ఉన్న ఆకాంక్షలకు అండగా నిలబడింది.

దళితులు, వెనుకబడిన కులాలు, స్త్రీలు, ఆదివాసీలకు విద్యా ఉద్యోగ రంగాలలోనూ చట్ట సభలలోనూ రిజర్వేషన్‌లు కల్పించాలనీ, కల్పించినవి అమలు చేయాలనీ ఎపిసిఎల్‌సి ఆందోళన చేసింది. ఎస్.సి కులాలన్నిటికీ సమాన అవకాశాలు ఇవ్వడం కోసం ఎస్‌సి రిజర్వేషన్‌ను వర్గీకరించాలన్న డిమాండుకు మద్దతు ఇచ్చింది. చట్ట సభలలో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న ప్రతిపాదనను సమర్థించింది.

కొందరికి అభివృద్ధి కల్పిస్తూ మరికొందరి జీవితాలనూ జీవనాన్నీ నాశనం చేసే పారిశ్రామిక వాతావరణ కాలుష్యాన్ని ఎపిసిఎల్‌సి వ్యతిరేకించింది. పేదలను నిరాశ్రయులు చేసి వారి జీవితాలను విధ్వంసం చేసే అభివృద్ధి విధానాలను వ్యతిరేకించింది. ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగానూ, మన రాష్ట్రంలో తెలంగాణ రాయలసీమ ప్రాంతాలు ఎదుర్కొంటున్న ఉద్దేశ్య పూర్వకమైన వివక్షకూ నిర్లక్ష్యానికీ వ్యతిరేకంగానూ ఆందోళన చేసింది. ఆ రెండు ప్రాంతాలు నిరంతరం ఎదుర్కొంటున్న కరువు సమస్య పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేసింది. ప్రభుత్వాలు అనుసరించే సామాజిక ఆర్థిక పాలనా విధానాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఉండాలని చెప్పే ఆర్టికల్ 37ను ప్రభుత్వాలు అమలు చేయాలని చెప్పింది.

రాయలసీమలోనూ ఇతర జిల్లాలలోనూ సామాజికంగా, ఆర్థికంగా బలవంతులయిన వాళ్లు ముఠాలు కట్టి దౌర్జన్యంతో ప్రజా జీవితాన్ని లోబరచుకొని ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్న వైనాన్ని ఎపిసిఎల్‌సి వ్యతిరేకించింది.

సహజ న్యాయసూత్రాలు, వ్యక్తుల పట్ల (వారు నేరస్తులయినా సరే) గౌరవం, మొదలయిన లక్షణాలు ప్రమాణంగా గల మానవీయమైన శిక్షాస్మృతి కోసం ఎపిసిఎల్‌సి ఆందోళన చేసింది. న్యాయస్థానాలు వేసే శిక్షలకు సంస్కరణ లక్ష్యం కావాలి తప్ప ప్రతీకారం కాదనింది. అందులో భాగంగా, మరణదండనను సూత్రప్రాయంగా రద్దు చేయాలని ఆందోళన చేసింది.

దేశ రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్య విలువలు, నైతిక ప్రమాణాలు పడిపోవడాన్ని ఎపిసిఎల్‌సి వ్యతిరేకించింది. లౌకిక వాదం ప్రజాస్వామ్యానికి మూలమైన విలువలలో ఒకటని గుర్తించి, బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత భారత సమాజంలో లౌకిక విలువలు, భిన్నత్వాన్ని గౌరవించే సంస్కృతి వేగంగా పతనం అవుతుండడాన్ని, మతోన్మాదం పెరుగుతుండడాన్ని ఎపిసిఎల్‌సి వ్యతిరేకించింది.

ప్రజా ఉద్యమాల పట్ల, ప్రస్తుత రాజకీయ వ్యవస్థను వ్యతిరేకించే రాజకీయ ఉద్యమాల పట్ల, అవి శాంతియుతంగా నడుస్తున్నాయా లేక హింసాత్మకంగానా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం ప్రజాస్వామికంగా నడుచుకోవాలని ఎపిసిఎల్‌సి ఆందోళన చేసింది. మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టే హింసాకాండను ఎపిసిఎల్‌సి ఏనాడూ సమర్థించలేదు. ప్రోత్సహించలేదు. అయితే దానిని కారణంగా చూపించి ప్రభుత్వం ఆ ఉద్యమాల సామాజిక ఆర్థిక భూమికను, రాజకీయ స్వభావాన్ని చూడడానికి నిరాకరించి, వాటిని కేవలం శాంతి భద్రతల సమస్యగా చూడడాన్ని వ్యతిరేకించింది.

పై విషయాలు వివాదానికి అతీతమనీ, వాటిపైన భిన్నాభిప్రాయాలు లేవనీ మా అభిమతం కాదు. ప్రజాస్వామ్యాన్నీ ప్రజాస్వామ్య హక్కులనూ కాపాడాలని కోరుకునే వారందరూ పై విషయాలకు సంబంధించిన అన్ని అంశాలలోనూ ఏకీభవించక పోవచ్చు. అయినప్పటికీ ఎపిసిఎల్‌సి ఏ కర్తవ్యాన్నయితే చేపట్టిందో అదొక అత్యవసరమైన కర్తవ్యం అనడంలో సందేహం అక్కరలేదు.

ఈ కర్తవ్యానికి ప్రజాస్వామ్య వాదులందరూ మద్దతు ఇవ్వడం చాలా అవసరం. అధికార దాహంతో రాజకీయ నాయకులు, అవినీతిపరులయిన ప్రభుత్వ అధికారులు, స్వార్థం మూర్తీభవించిన సామాజిక ఆధిపత్య వర్గాలు భారత ప్రజాస్వామ్యాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని తమ ప్రయోజనాల కోసం దానిని వక్రీకరించి సామాన్య ప్రజల ప్రయోజనాలకూ మన సమాజం భవిష్యత్తుకూ విఘాతం కలిగిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ ప్రయత్నం మరీ అవసరం.

అందువల్ల ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) 10వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆ సంస్థకు వీ ు అందియ్యగల సహాయ సహకారాలన్నీ అందివ్వవలసిందిగా మిమ్ములను కోరుతున్నాము.

15 జూలై 1995

**ఆహ్వాన సంఘం**
**ఎపిసిఎల్‌సి 10వ రాష్ట్ర మహాసభలు**
**హైదరాబాద్**

**శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు(అధ్యక్షులు), శ్రీ కేశవరావు జాదవ్,**
**శ్రీమతి జిలానిబానో, డా॥ హంగ్లు, డా॥ రెహనా సుల్తానా, డా॥ అరుణ్ పట్నాయక్,**
**శ్రీమతి ఆర్. అఖిలేశ్వరి, డా॥ బి. చంద్రశేఖర్, శ్రీ నచికేతదేశాయి, బ్రదర్ వర్గీస్**